

20, 21 తేదీల్లో భీమవరంలో పవన్ పర్యటన



ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 20, 21 తేదీల్లో భీమవరంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ నెల 16న భీమవరం రావాల్సిన పవన్‌కళ్యాణ్ హెలికాప్టర్‌కు ల్యాండింగ్‌కు అనుమతి లేదని పర్యటన వాయిదా పడింది. దీంతో అధికార పార్టీపై జనసేన నాయకులు విమర్శలు గుప్పించారు. ఈ నెల 20న పెదమిరంలోని నిర్మల ఫంక్షన్ హాలుకు పవన్ చేరుకుంటారని తెలుస్తుంది. రాత్రికి అక్కడే బస చేసి, రెండు రోజుల పాటు జనసేన, టిడిపి నాయకులతో పవన్ ప్రత్యేక సమావేశం నిర్వహించి పార్టీలోని పలు అంశాలను చర్చించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

'పొత్తు' కుదరని ప్రచారం..!



ఉంగుటూరు నియోజకవర్గంలో విడివిడిగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి, జనసేన నాయకుల తీరుపై సర్వత్రా చర్చ

నియోజకవర్గాల్లో ఎవరి ప్రచారం వారిదే

నేనే అభ్యర్థినంటూ జనాల్లోకి వెళ్తున్న ఇరుపార్టీల నేతలు

టిక్కెట్ల కేటాయింపుల్లో ఆలస్యంతో గందరగోళం

టిక్కెట్ల ప్రకటన తర్వాత సహకారం పరిస్థితి ఏమిటో అన్న అనుమానాలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన నాయకులు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం రెండు జిల్లాలోనూ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తాయంటూ ఆయా పార్టీల అధినాయకులు ఇప్పటికే ప్రకటించారు. అసెంబ్లీ, ఎంపీ సీట్ల కేటాయింపులపై పార్టీ అధ్యక్షులు అనేక దఫాలుగా కూర్చుని చర్చించుకోవడం అందరికీ తెలిసిందే. ఇరు పార్టీల పొత్తుకు సంబంధించిన వ్యవహారం మాత్రం నియోజకవర్గాల్లో ఎక్కడా కానరావడం లేదు. టిడిపి, జనసేన నాయకులు ఎవరి ప్రచారం వారిదే అన్నట్లు కొనసాగిస్తున్నారు. తానే ఎంఎల్ఎ అభ్యర్థినంటూ చెబుతూ టిడిపి, జనసేన నాయకులు జనాల్లోకి వెళు న్న పరిస్థితి నెలకొంది. దీంతో టిక్కెట్ ఎవరికి అన్న చర్చ జనాల్లో విస్తృతంగా కొనసాగుతోంది. ముఖ్యంగా జనసేనకు ఉంగుటూరు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, కైకలూరు లేక ఏలూరు అసెంబ్లీ స్థానాలను కేటాయించే అవకాశం ఉందని ఆది నుంచి ప్రచారం సాగుతోంది. ఆయా స్థానాల్లో ఇరు పార్టీల నుంచి టిక్కెట్ ఆశిస్తున్న నాయకులు ఎన్నికల ప్రచారం సాగిస్తుండడంతో అందరినీ గందగోళంలో పడేస్తోంది. ఉంగుటూరు నియోజకర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా గన్ని వీరాంజనేయులు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగిస్తుండగా, అదేరీతిన జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరినట్లు అధినాయకుల ప్రకటించినప్పటికీ ప్రచారం మాత్రం ఎవరికి వారే అన్నట్లు చేసుకుంటున్నారు. నరసాపురం నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొంది. జనసేన నుంచి బొమ్మిడి నాయకర్ ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకుని జనాల్లోకి వెళ్తున్నారు. టిడిపి నుంచి కొవ్వలి రామ్మోహనరావు ఎన్నికల ప్రచారంలో భాగంగా జనాల్లో తిరుగుతున్నారు. టిడిపి నుంచి మరో ఇద్దరు నాయకులు సైతం పొత్తూరి రామరాజు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు సైతం జనాల్లో ఉంటున్న పరిస్థితి నెలకొంది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో జనసేన ఉంచి బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నుంచి వలవల బాబ్జీ ఇద్దరు ఎవరి ప్రచారం వారిదే అన్నట్లు తిరుగుతున్నారు. ఏలూరులోనూ టిడిపి నుంచి బడేటి చంటి, జనసే నుంచి రెడ్డి అప్పలనాయుడు సైతం ఇదేవిధంగా ప్రచారం నిర్వహించుకుంటున్నారు. భీమవరంలోనూ టిడిపి, జనసేన నాయకులు వేరువేరుగా తమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. టిడిపి, జనసేన నాయకులు ఎవరి దారి వారిదన్నట్లు వ్యవహరిస్తున్న తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏ ఇద్దరు కలిసినా తమ నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థికి టిక్కెట్ ఇస్తారా.. లేక జనసేకు ఇస్తారా అన్న చర్చ నెలకొంది. టిడిపి, జనసేన మధ్య ఎన్నికల పొత్తు కుదిరినప్పటికీ క్షేత్రస్థాయిలో నాయకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడం అందరినీ అయోమయానికి గురిచేస్తోంది. ఇరుపార్టీల అభ్యర్థులు విడివిడిగా తిరుగుతున్న తీరు చూసిన వారికి ఒకటో ఆలోచన కలుగుతోంది. టిక్కెట్ల కేటాయింపు తర్వాత టిక్కెట్ రాని వారు బరిలో ఉన్న అభ్యర్థికి సహకరిస్తారా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే క్షేత్రస్థాయిలో టిడిపి, జనసేన నాయకుల మధ్య ఏమాత్రం పొత్తు కుదరని పరిస్థితి నెలకొంది. అభ్యర్థుల ఎంపిక తర్వాత పరిస్థితి ఏంటన్న అభిప్రాయం అందరిలోనూ కొనసాగుతోంది. టిక్కెట్ల కేటాయింపులో అధిష్టానం వ్యవహరిస్తున్న తీరే ఈ పరిస్థితికి కారణమన్న అభిప్రాయం, టిడిపి, జనసేన నాయకుల్లోనూ వ్యక్తమవుతోంది.

పశ్చిమను అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

- పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి
- హాజరుకానున్న 21,341 మంది విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 85 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దష్టి
- ప్రజాశక్తితో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకటరమణ



ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని, ఈ ఏడాది పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో పశ్చిమగోదావరి జిల్లాను అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థుల సన్నద్ధత, తీసుకున్న చర్యలు, చేసిన ఏర్పాట్లు వంటి అంశాలపై ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు. ఒక ఉపాధ్యాయునికి ఐదుగురు విద్యార్థులను దత్తత చేసి ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ చూపే విధంగా చర్యలు చేపట్టమన్నారు. ముఖ్యంగా సి, డి గ్రేడ్ విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 85 శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు డిఇఒ వెంకటరమణ వెల్లడించారు.



ప్రశ్న: ఈ ఏడాది పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నారు?

డిఇఒ : విద్యార్థులను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించాం. ఏ కేటగిరి విద్యార్థులు నూటికి నూరు శాతం సాధిస్తారు. ముఖ్యంగా సి, డి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఐదుగురు చొప్పున ఒక ఉపాధ్యాయునికి దత్తత చేయడం జరిగింది. స్టడీ అవర్లో చదివించడం, రాయించడం వంటివి ఉపాధ్యాయుని ప్రథమ కర్తవ్యంగా ఆదేశించాం. ప్రతి విద్యార్థి పైనా ప్రత్యేక పర్యవేక్షణ చేసే విధంగా చర్యలు చేపట్టాం.

ప్రశ్న : ఉపాధ్యాయ అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టారు?

డిఇఒ: విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలన్నదే మా తాపత్రయం. దీనికి అన్ని విధాలా చర్యలు చేపట్టాం. జిల్లా పరిషత్ ఛైర్మన్ అందించిన స్టడీ మెటీరియల్‌తో పాటు విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో సొంతంగా గణిత దీక్ష మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందించాం. ఈ మెటీరియల్ చదివితే విద్యార్థులు అవలీలగా ఉత్తీర్ణత సాధిస్తారు. తరగతులు పూర్తయ్యేంత వరకూ ఉపాధ్యాయులు సెల్ ఫోన్లు వినియోగించకుండా నో సెల్ఫోన్ జోన్ పరిధిలోకి తీసుకొచ్చాం.

ప్రశ్న : గతేడాది ఏ విధంగా ఉన్నాయి. ఉత్తీర్ణతా శాతం ఎంత వచ్చింది?

డిఇఒ : గతేడాది 20,300 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 10 వేల మంది ఫస్ట్ క్లాస్, 2 వేల మంది సెకండ్ క్లాస్, 1500 మంది థర్డ్ క్లాస్ మొత్తం 13,500 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సుమారు 6,860 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. గతంలో 65.9 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది మరో 20 శాతం పెంచి 85 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

ప్రశ్న : గతేడాది ఏ సబ్జెక్టులో ఎంతమంది ఫెయిల్ అయ్యారు, వారికోసం ఈ ఏడాది ఏం చర్యలు చేపట్టారు?

డిఇఒ : గతేడాది లెక్కల సబ్జెక్టులో 3,800 ఫెయిల్ అయ్యారు. 2 వేల మంది విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. 4,500 మంది విద్యార్థులు ఈ ఏడాది రెగ్యులర్ పరిధిలో పాఠశాలలో చేరారు. వీరంతా ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు. రిజర్వ్ విద్యార్థులకు గతంలో వచ్చిన మార్కుల కంటే తక్కువ వస్తే పాత మార్కులే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది. ఎక్కువ మార్కులు వస్తే పాత వాటితో సంబంధం లేకుండా ఎక్కువ మార్కులను పరిగణలోకి తీసుకుంటాం.

ప్రశ్న:ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు?

డిఇఒ: ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు రెగ్యులర్ విద్యార్థులు కలిపి 21,341 మంది పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. దీనిలో బాయ్స్ 14,624, గర్ల్స్ 12,802 మంది ఉన్నారు. గతేడాది ఫెయిల్ అయిన 6,085 మంది విద్యార్థులతో కలిపి మొత్తంగా 27,426 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న : పరీక్షల నిర్వహణకు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు? ఎంతమంది అధికారులను నియమించారు?

డిఇఒ : జిల్లా వ్యాప్తంగా 127 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 24 మంది రూట్ అధికారులు, సెట్టింగ్ స్క్వాడ్లు, మరో ఆరుగురు స్క్వాడ్ అధికారులు, 1,325 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. గతంలో మాదిరిగానే సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాం. అలాగే విద్యార్థులు ప్రశాంతతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం.

ప్రశ్న : ఎప్పటి నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి? ఏ సమయంలో జరగనున్నాయి?

డిఇఒ : మార్చి 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. 30వ తేదీతో పరీక్షలు ముగుస్తాయి. మార్చి 18న తెలుగు పరీక్ష, 19న హిందీ, 20న ఇంగ్లీష్, 22న లెక్కలు, 23న ఫిజికల్ సైన్స్, 26న బయోలాజికల్ సైన్స్, 27న సోషల్, 28న ఒఎస్ఎస్‌సి, 30న సాంస్క్రీట్ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 నిమిషాల వరకూ పరీక్షలు జరుగుతాయి. పక్షులకు గంట ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలి. నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతించే పరిస్థితి ఉండదు. విద్యార్థులు గమనించాలి.

గ్రామ స్వరాజ్యానికి నిర్వచనం శృంగవృక్షం

సర్పంచి సూరిబాబు సేవలు అభినందనీయం - శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యానికి శృంగవృక్షం గ్రామమే నిర్వచనమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు అన్నారు. గ్రామ సర్పంచి జంగం సూరిబాబు గ్రామానికి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. శృంగవృక్షంలో గ్రామ సర్పంచి జంగం సూరిబాబు ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం - 2 భవనాన్ని ఆదివారం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు)తో కలిసి శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిరథ మహారథులకు సర్పంచి




సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కొయ్యే మోషేనురాజు

సూరిబాబు ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తీన్మార్ డప్పులతో, పూల వర్షం కురిపించే ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోషేనురాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ గ్రామాల స్వరూపాన్ని మార్చారన్నారు. గ్రామస్థాయిలో సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పారన్నారు. శృంగవృక్షం గ్రామంలో సచివాలయ భవనం అధునాతన రీతిలో ఉందని దీనికి సర్పంచి సూరిబాబు చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉపసర్పంచి కలిదిండి ఆనందరాజు, ఉప ఎంపిపిలు ఆదాడ లక్ష్మి తులసి, సోడదాశి నరేష్, ఎంపిటిసిలు మల్లుల సూర్యకళ, బోల్లం గాంధీ, సర్పంచులు బొల్లా శ్రీనివాస్, చింతపల్లి చిన్న, కడలి నాగేశ్వరి పాల్గొన్నారు.

కోటిరాజుకు కోటిపల్లివాసుల సత్కారం

ప్రజాశక్తి - ఉండి

వెంకయ్య వయ్యేరుపై వంతెన నిర్మించాలనే కలిగొట్ల గ్రామ ప్రజల కోరిక మేరకు తన వంతుగా రూ.25 లక్షలు ఆర్థిక సహాయం చేసిన రాజు వేగేశ్న ఫౌండేషన్ అధినేత అనంత కోటిరాజును గ్రామస్తులు ఎంపిటిసి సభ్యులు రుద్రరాజు సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రుద్రరాజు సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తమ గ్రామంలో రైతులు కొల్లేరులోని తమ పొలాలకు, చెరువులకు వెళ్లేందుకు సుమారు 12 కిలోమీటర్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేదన్నారు. దీంతో వెంకయ్యవయ్యేరుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులందరూ ఏకాభిప్రాయానికి వచ్చామన్నారు. వంతెన నిర్మించడానికి రైతులందరూ సమిష్టిగా తమ వంతు ఆర్థిక సహకారం అందించగా అనంత కోటిరాజు రూ.25 లక్షలు సహకారం అందించి వంతెన నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. గ్రామ ప్రజలందరూ ఆయనకు రుణపడి ఉంటారన్నారు. అనంతరం అనంత కోటిరాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఏ అవసరం ఉన్నా ఎంపిటిసి రుద్రరాజు సూర్యనారాయణరాజుతో తన దృష్టికి తీసుకొస్తే సాయం అందిస్తానన్నారు. కోటిరాజును గ్రామ మాజీ సర్పంచి చింతలపాటి సీతారామరాజు, సాగిరాజు కృష్ణంరాజు, యశోద కృష్ణ, కూచంపూడి రామభద్రరాజు, మాదిరెడ్డి రాజేష్, బండారు సుబ్బయ్య సన్మానించారు.



అనంత కోటిరాజును సత్కరిస్తున్న గ్రామస్తులు




నరసాపురంలో కురుస్తున్న మంచు

మంచుతో వాహనదారుల అవస్థలు

నరసాపురం : నరసాపురంలో ఆదివారం తెల్లవారుజామున మంచు భారీగా కురిసింది. ఉదయం తొమ్మిది గంటలైనా కూడా మంచు పోలేదు. దీంతో వాహన దారులు పలు అవస్థలు పడ్డారు. రాత్రి సమయంలో ఉష్ణోగ్రత గణనీయంగా పడిపోతుంది. పగటి పూట ఎండ పెరిగిపోతుంది. మంచులో ప్రయాణించేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రాత్రి సమయంలో, ఉదయం పూట చలి నుంచి తట్టుకునేందుకు పల్లెటూర్లలో చలి మంటలు వేసుకుంటున్నారు. ప్రజలు మంకీ క్యాప్, స్వెట్టర్ ధరించాలని వైద్యులు చెబుతున్నారు.

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ వైసిపి : పివిఎల్



లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా వైసిపి ప్రభుత్వం నిలిచిందని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని యండగండి రెండో సచివాలయ పరిధిలో రెండో రోజు ఆదివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పివిఎల్.నరసింహరాజు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అవసరమైన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకులను నిర్మిస్తూ అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వెళ్లిన ప్రతి గడపలోనూ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపైనా, సంక్షేమ పథకాలపైన ప్రజలు సంతృప్తి వ్యక్తపరిచారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు మూకుమ్మడిగా రాష్ట్ర ప్రభుత్వంపై దాడి చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒంటరిగానే పోరాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని భారీ మెజార్టీతో అత్యధిక స్థానాలు అందించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి, ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, వైస్ ఎంపిపి దత్తాల సుజాతరాణి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు గొర్రెముచ్చు సుందర్‌కుమార్, గుండు నాగేశ్వరరావు, బందెల ప్రమీలజార్జ్, వెలగపల్లి టోనీబాబు పాల్గొన్నారు

సిపిఎస్ రద్దు కోరుతూ జాతీయ ఉద్యమం

ఉద్యమాలను అణిచివేయాలని చూస్తే అధోగతి తప్పదు

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, తిమ్మన్న

ముగిసిన 77వ కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎస్ రద్దు కోరుతూ ఎస్‌టియు ఆధ్వర్యంలో జాతీయ ఉద్యమం చేపడతామని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, తిమ్మన్న హెచ్చరించారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రమైన బైబిల్, ఖురాన్, భగవద్గీతతో పోల్చిన ముఖ్యమంత్రి జగన్ సిపిఎస్ రద్దు హామీ ఏమైందని ఎస్‌టియు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఎస్‌టియు 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎస్‌టియు కార్యవర్గం సభ్యులు వివిధ అంశాలపై చర్చించారు.



మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు

ఎస్‌టియు ఆధ్వర్యంలో ఇప్పటివరకు జరిగిన ఉద్యమాలు, సాధించిన ఫలితాలు, రానున్న కాలంలో చేపట్టబోయే ఉద్యమ ప్రణాళికలపై ప్రధానంగా చర్చించారు. ఉద్యోగ ఉపాధ్యాయులపై ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను కౌన్సిల్ సమావేశం మూకుమ్మడిగా ఎండకట్టింది. ఈ సందర్భంగా సాయిశ్రీనివాస్, తిమ్మన్న మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి అధికారం చేపట్టిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సిపిఎస్‌ను రద్దు చేయకుండా దాని స్థానంలో జిపిఎస్‌ను తీసుకురావడం అన్యాయమని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇది తీవ్ర నష్టం కలిగిస్తుందని చెప్పారు. సిపిఎస్ రద్దు కోసం సిపిఎస్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనపై నిర్బంధం విధించడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌సి, తెలంగాణ ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి సదానందగౌత్, డిఇఒ ఆర్.వెంకటరమణ, రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ప్రసాద్, గౌరీ శంకర్, కెవి.రామచంద్రరావు, సాయివర్మ, ప్రసాద్‌రాజు, నారాయణ, సామ్యూల్ పాల్గొన్నారు.

చలో విజయవాడపై నిర్బంధం సరికాదు

సిఎం జగన్ హామీని నిలబెట్టుకోవాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని కోరుతూ ఎపిసిపిఎస్ ఉద్యోగులు చేపట్టిన చలో విజయవాడకు వెళ్లనివ్వకుండా ఎక్కడికక్కడ నిర్బంధించడాన్ని సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ చర్యలతో ప్రభుత్వ నిరంకుశ వైఖరి మరోసారి బహిర్గతమైందని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఎపిసిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపిచ్చిన చలో విజయవాడ భగ్నం చేసి, ఉద్యోగులను రానీయకుండా ఎక్కడికక్కడ నిర్బంధించడం చర్చలకు పిలిచి అరెస్టు చేయడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని, నిరంకుశ వైఖరిని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ప్రజలంతా ఖండించాలని కోరారు.

వరప్రసాద్‌కు విద్యార్థుల సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని జివిఎన్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో లయన్స్ జిల్లా లిటరసీ రీడింగ్ ఛైర్మన్ పాటపళ్ల నాగదుర్గావరప్రసాద్‌కి విద్యార్థులు చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు నాలుగు రీజియన్‌లో లైబ్రరీ బుక్స్ అందించారని, లంకలకోడేరు ఎంపిపి పాఠశాలకు ఫ్యాన్లు బహుకరించారని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు కావాల్సిన రూ.15 వేల విలువైన విద్యాసామాగ్రిని స్కూలుకు అందిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. 2016 నుంచి ఇప్పటివరకు ఏ స్కూలులో ఏ అవసరమొచ్చినా తన వంతు సహాయం చేశానని వరప్రసాద్ చెప్పారు. విద్యార్థులు భారతమాత చిత్రపటం ఇచ్చి శాలువాతో సత్కరించారు.



దాత వరప్రసాద్‌ను సత్కరిస్తున్న విద్యార్థులు

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రహదారి పనులను పరిశీలిస్తున్న ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

రహదారి నిర్మాణ పనులను వేగంగా నాణ్యంగా పూర్తి చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. రూ.12 కోట్లతో వంతెన, కాళీపట్నం - పాతపాడు గ్రామాల్లో సీసీ రహదారి నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆయనతో పాటు సర్పంచి కవురు సావిత్రి ఆదినారాయణ, సొసైటీ ఛైర్‌పర్సన్ దొంగ నాగమణి, రామాని ఉమామహేశ్వరరావు ఉన్నారు.

కొబ్బరి బొండం.. పోషకాలు అనేకం

ప్రజాశక్తి - ఆచంట

కొబ్బరి చెట్టును పెంచుకుంటే మేలని పెద్దలు చెబుతారు. ఆ రీతిలో కొబ్బరి చెట్టు జీవనోపాధికి చేయూతనిస్తుంది. ప్రతి నెలా ప్రభుత్వం పింఛన్ వచ్చినట్లు కొబ్బరి చెట్టు కాయలు అమ్ముకోవడం ద్వారా ఆదాయం లభిస్తుంది. కేవలం రైతులకే కాకుండా చదువుకున్న వేలాదిమందికి ఉపాధి పొందటానికి అవకాశం ఉంటుంది. కొబ్బరి ద్వారా సుమారు 150 రకాల ఉత్పత్తులు చేస్తుంటారు. వీటి తయారీకి అవసరమైన పరిశ్రమలు అందుబాటులో లేకపోవడంతో అవి నిరుపయోగం అవుతున్నాయి. కొబ్బరిమట్ట నుంచి మాను ఇతర భాగాలు అన్ని వివిధ రకాలుగా సద్వినియోగం చేసుకోవచ్చు.



కొబ్బరినీళ్ల దాహార్తిని తీర్చడమే కాకుండా మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు పుష్కలంగా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి బొండం నీరు తాగడానికే కాకుండా కొబ్బరిని వంటకాల్లో కూడా ఎక్కువగా వినియోగిస్తారు. ఈ నీళ్లల్లో ఎక్కువ ప్రయోజనాలు ఉండటం వల్ల ప్రజలు ఎక్కువగా కొబ్బరి నీరును తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొబ్బరి బొండాల్లో తెల్ల రక్త కణాలు పెంచే శక్తి, వ్యాధి నిరోధక శక్తి ఉంటుంది. ముఖ్యంగా బి కాంప్లెక్స్ విటమిన్ సి, క్యాల్షియం, మెగ్నీషియం వంటి మినరల్స్ కొబ్బరిబొండంలో అధికంగా ఉన్నాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మైక్రో న్యూట్రిషన్ వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో బాగా సహాయపడుతుంది. ప్రతిరోజు ఉదయం కొబ్బరి నీళ్లు తాగితే మరింత శక్తినిస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ శక్తిని పెంచుతాయి. డిహైడ్రేషన్, డయేరియా, వాంతులు, చెమట వల్ల శరీరంలో కోల్పోయిన నీటిని పునరుద్ధరిస్తుంది. కొబ్బరి నీళ్లలో తేనె కలిపి ఉదయం తాగితే మంచి ఫలితం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. కొబ్బరినీళ్ల గుండెకు మేలు చేస్తాయి. కొబ్బరి బొండం నీరు బరువు తగ్గించడానికి ఎంతో ఉపకరిస్తుంది. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. తద్వారా పొట్ట తగ్గడానికి సహాయపడుతుంది. దీంతో బరువు తగ్గడం సులభంగా అవుతుంది. ఎండ కారణంగా డిహైడ్రేషన్‌కు తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయంలో కొబ్బరి బొండం తాగితే తలనొప్పి నుంచి కొంతవరకు ఉపశమనం పొందొచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. కొబ్బరి నీరులో ఎన్నో పౌష్టిక ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది సులభంగా జీర్ణం అవుతుంది. బలహీనంగా ఉన్న వ్యక్తికి గ్లూకోజ్ దొరకనప్పుడు కొబ్బరి నీళ్లు పట్టిస్తే గ్లూకోజ్‌తో పాటు పొటాషియం, సోడియం వంటి ఖనిజాలు పొందవచ్చు. శరీరంలోని వేడిని తగ్గించి కావాల్సిన చల్లదనాన్ని ఇస్తుంది. ముఖ్యంగా వేసవికాలంలో దప్పికను తీర్చుతుంది. అతి సారా, మూత్ర విసర్జన తక్కువ, ఎక్కువ జరిగిన పరిస్థితుల్లో శరీరంలోని నీరు తగ్గిన సమయంలో కొబ్బరి నీరును తాగుతారు.

కొబ్బరి పాలు శ్రేష్టమే

పచ్చి కొబ్బరి పాలు మంత్రజాలంలా పని చేస్తాయి. ఇందులో విటమిన్ ఎ, బి, సి, ఐరన్ కాలుష్యం ఫాస్పరస్ కార్బొహైడ్రేడ్, ప్రొటీన్, కొవ్వు సమృద్ధిగా లభిస్తాయి. కొబ్బరికాయ ముదిరిన తరువాత వచ్చే పువ్వు గర్భాశయానికి మేలు చేస్తుంది. బాలింతలు అధిక రక్తస్రావంతో ఇబ్బంది పడితే కొబ్బరి పువ్వు రసాన్ని తీసుకుంటే సత్వరం ఉపశమనం కలుగుతుంది. కొబ్బరిపాలు తలకు పట్టిస్తే కేశాలు కాంతివంతంగా కనిపిస్తాయి. చర్మం మృదువుగా మారుతుంది.

15 రోజుల పాటు తాగితే మంచి ఫలితాలు

సిహెచ్‌సి వైద్యాధికారి దిగుపాటి జితేంద్ర

15 రోజుల పాటు క్రమం తప్పకుండా లేత కొబ్బరి బొండం నీళ్లు తాగితే అద్భుతమైన ఫలితాలు పొందవచ్చని ఆచంట సిహెచ్‌సి వైద్యాధికారి దిగుపాటి జితేంద్ర అన్నారు. అజీర్ణం, కడుపునొప్పి, హృదయ సంబంధిత అనేక సమస్యలను నివారించవచ్చన్నారు. వ్యాయామం ముందు కొబ్బరి నీళ్లు తాగితే అందులో ఉండే మినరల్స్ శరీరం త్వరగా గ్రహిస్తుందన్నారు. వ్యాయామ సమయంలో కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్, ఎనర్జీ అందించడంతో పాటు కండరాల నొప్పిని నివారించే గుణాలు కొబ్బరి నీళ్లలో ఉన్నాయి. చాలామంది పరగడుపున కొబ్బరి నీళ్లు తాగవద్దని చెబుతుంటారు. అయితే ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదు. పరగడుపున కొబ్బరి నీళ్లు తాగితే ఎక్కువ శక్తి వస్తుంది. వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. బ్యాక్టీరియా సూక్ష్మ క్రిముల భారీ నుంచి మన శరీరాన్ని కాపాడుకోవచ్చు. ఇన్ని ఉపయోగాలు ఉన్న కొబ్బరి బొండాలను నిర్లక్ష్యం చేయకుండా తాగడానికి ప్రయత్నించాలి. కేవలం అనారోగ్యం సమయంలోనే కాకుండా రోజుకొకసారి కొబ్బరి నీళ్లు తాగుతూ ఉండడంవల్ల ఎటువంటి అనారోగ్యం బారిన పడకుండా తమ తమ శరీరాలను కాపాడుకోవచ్చని తెలిపారు.



ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మార్జిన్

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్

కూలిన చెట్టు

ఎండిన మరో రెండు చెట్లు

ప్రజాశక్తి - కాళ్ల

మండలకేంద్రమైన కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో జువ్వలపాలెం ఆర్అండ్‌బి రోడ్డులోఉన్న చెట్లు ప్రమాదభరితంగా మారాయి. ఇటీవల పెద్ద నిద్రగన్నేరు చెట్టు కూలిపోయింది. దీంతో రోడ్డు మార్జిన్ ప్రమాదభరితంగా మారినా ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కూలిన చెట్టుకు సమీపంలో రెండు ఎండిన నిద్ర గన్నేరు చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో పడిపోయిన చెట్టు వద్ద రోడ్డు మార్జిన్ ప్రమాదకరంగా లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎండిన చెట్లు ప్రయాణికులపై కూలితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పడిపోయిన చెట్టును తొలగించి రోడ్డు మార్జిన్ అభివృద్ధి చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.




ప్రభాకరరావుతో మాట్లాడుతున్న ముదునూరి ప్రసాదరాజు

ప్రభాకరరావును కలిసిన చీఫ్‌విప్ ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం విచ్చేసిన నరసాపురం మాజీ ఎంఎల్ఎ పరకాల కాలికాంబ కుమారుడు, ప్రభుత్వ మాజీ సలహాదారుడు పరకాల ప్రభాకరరావును అల్లూరి కళ్యాణమండపంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐదేళ్ల ప్రభుత్వ పరిపాలనలో నరసాపురం నియోజకవర్గ అభివృద్ధి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ, దొంగ మురళీకృష్ణ, జయరాజు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ రామరాజు

మహిళాభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - ఆకివీడు

టిడిపి అధికారంలోకొస్తే మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ఎంఎల్ఎ రామరాజు అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం గడపగడపకు రాంబాబు కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్లకోడు గ్రామంలో ఆయన ఆయన పర్యటించారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి తమ పార్టీ ప్రకటించిన ప్రణాళికను వివరించి కరపత్రాన్ని పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేసి విజయాన్ని చేకూర్చాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు ప్రసాద్, ఆకివీడు పట్టణ అధ్యక్షులు బొల్లా వెంకట్రావు, టిడిపి తాళ్లకోడు నాయకుడు జన్ను గోపీ, జిల్లా నాయకులు గుడిగంటల వెంకటేశ్వరరావు, ఎండి అజ్మల్, సుజాత పాల్గొన్నారు..

నేరాలు - ఘోరాలు

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - నరసాపురం

రైలు కింద పడి స్వర్ణాంధ్ర కళాశాల ఇంజినీరింగ్ విద్యార్థి గుడాల కిరణ్‌సాయికుమార్ (20) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆర్‌పిఎఫ్ ఎస్ఐ పి.రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నరసాపురం పట్టణంలోని రుస్తుంబాద మెరకగూడేనికి చెందిన గుడాల కిరణ్‌సాయికుమార్ ధర్మవరం ఎక్స్‌ప్రెస్ ఇంజన్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సాయికుమార్ మృతదేహాన్ని నరసాపురం నుంచి లింగపల్లి వెళ్తున్న ట్రైన్ లోకోపైలెట్ గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - పాలకొల్లు



మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

మండలంలోని కాపవరంలో అక్రమంగా నిల్వ ఉంచిన 182 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పాలకొల్లు సెబ్ అధికారి చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లంకలకోడేరు నుంచి కాపవరం రోడ్డునకు ఎడమవైపు ఉన్న రొయ్యల చెరువు వద్ద ఉన్న ఒక ఇంట్లో తెలంగాణాకు చెందిన అనధికార 110 మద్యం సీసాలు, 72 బీర్ సీసాలను స్వాధీన పరచుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎస్‌పి, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి ఎటివి.రవికుమార్ ఆదేశాల మేరకు ఇంటిలిజెన్స్ టీంకు రాబడిన సమాచారం మేరకు ఈ దాడి చేసినట్లు తెలిపారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని కొమ్ముచిక్కాల గ్రామంలో ఆలమూరు-లంకలకోడేరు రహదారిపై ఆదివారం సాయంత్రం ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. వీరవాసరం మండలం రాయకుదురు గ్రామానికి చెందిన కొందరు గౌరీపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోలో మొత్తం ఎనిమిది మంది ప్రయాణిస్తుండగా సునీత, భవాని, మణిబాబు, రమేష్ గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని 108 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆదిత్య కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదిత్య డిగ్రీ కాలేజీలో ఆదివారం ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు జిల్లాలోని అన్ని ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం రావటం కష్టంగా ఉందని, కానీ తమ ఆదిత్య సంస్థలో ప్రతిరోజూ విద్యార్థులకు తాము నిర్వహించే సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ శిక్షణా తరగతుల మూలంగానే ఉద్యోగాల కల్పన సాధ్యపడుతోందన్నారు. ఉద్యోగాలు కల్పించడానికి తమ యాజమాన్యం ఎల్లపుడు ముందుంటుందన్నారు. డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆదిత్యలో చదివితే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, ప్లేస్‌మెంట్ అధికారులు, వివిధ విభాగాధిపతులు,అధ్యాపక అధ్యపకేతర బృందం పాల్గొన్నారు.

వైసిపి మండల ఉపాధ్యక్షునిగా రాయిసతీష్

ప్రజాశక్తి - ఉండి

వైసిపి మండలాధ్యక్షునిగా నియామకమైన రాయి సతీష్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ రాయి సతీష్ గతంలో గ్రామ పార్టీ అధ్యక్షులుగా పనిచేసే సమయంలో పార్టీ పట్ల అంకితభావంతో పని పనిచేశారన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం రాయి సతీష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ మండల ఉపాధ్యక్షునిగా నియమించిన పివిఎల్.నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస దొరబాబు

మండలంలోని పెదపుల్లేరు గ్రామానికి చెందిన పాటూరి శ్రీనివాస దొరబాబు వైసిపి మండల ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను అభినందించారు. అనంతరం శ్రీనివాస దొరబాబు మాట్లాడుతూ తనకు మండల ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన అధిష్టానానికి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహరాజుకు ధన్యవాదాలు తెలిపారు

క్షీరా రామలింగేశ్వర ఆలయ సన్నిధిలో ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ ఆదివారం కుటుంబ సభ్యులతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభంతో, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనతో పాటు సోదరుడు, తల్లిదండ్రులు ఆలయానికి విచ్చేశారు. వారికి స్వామివారి ఫొటో, ప్రసాదాన్ని అందించారు. ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్ ఆయనకు స్వాగతం పలికారు. ఆయనతో పాటు విఆర్‌ఒ సుబ్బారావు ఉన్నారు.

నేడు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. ఈ ప్రమాణస్వీకారం మహోత్సవానికి చీఫ్ విఫ్ ముదునూరు ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా హాజరై ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి యాత్రికులు, గ్రామస్తులు హాజరు కావాలని తెలిపారు.

'ఎంఎల్ఎ నిమ్మలవి అసత్యప్రచారాలు'

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ప్రభుత్వం 27 దళిత పథకాలను రద్దు చేసిందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అసత్యప్రచారాలు చేస్తున్నారని వైసిపి నేతలు అన్నారు. పాలకొల్లు వైసిపి కార్యాలయంలో టౌన్ ఎస్‌సి సెల్ నూతన కమిటీ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. టిడిపి ఎన్ని మాయమాటలు, అబద్ధాలు చెప్పినా ఎస్‌సి నాయకులు, కార్యకర్తలందరూ వైసిపి ప్రభుత్వం వచ్చాక చాలా ఆనందంగా ఉన్నామని చెప్పారు. ప్రభుత్వం అద్భుతంగా పరిపాలిస్తోందని, వచ్చే ఎన్నికల్లో ఎస్‌సిలందరూ కలిసికట్టుగా పనిచేసి పాలకొల్లులో వైసిపి జెండా ఎగరవేస్తామన్నారు. పాలకొల్లు పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కోట రత్నరాజు, ఉపాధ్యక్షులు నవీన్, నక్క సహదేవుడు, ప్రధాన కార్యదర్శి ఈద మధు పాల్గొన్నారు.

అవకాశమిస్తే ఉండి నుంచి పోటీ చేస్తా

కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల



అభ్యర్థిత్వ పత్రాలు అందిస్తున్న గోపాలకృష్ణంరాజు

మండలంలోని కాళ్లకూరు గ్రామానికి చెందిన గోపాలకృష్ణంరాజు ఉండి నియోజకవర్గంలో నిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమం చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకుండానే ఉండిలో రాజకీయం రోజురోజుకీ వేడెక్కుతుంది. ఇదిలా ఉండగా తాజాగా ఉండి నియోజకవర్గంలో పోటీకి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు సిద్ధమయ్యారు.

ఉండి అసెంబ్లీ బరి నుంచి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, తనకు అవకాశం కల్పించాలని వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు కోరారు. ఈ మేరకు ఇటీవల మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో తన అభ్యర్థిత్వ పరిశీలనపత్రాన్ని పార్టీ పెద్దలకు అందించారు. 1983 నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా, మండలాధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. గ్రామ సర్పంచిగా, ఎంపిటిసిగా, ఎంపిపిగా ప్రజలకు సేవలందించారు. మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు ప్రోత్సాహంతో పిసిసి కమిటీ సభ్యులుగా, పిసిసి జాయింట్ కమిటీ సభ్యులుగా పార్టీ క్రియాశీలకంగా పని చేశారు. 2020 నుంచి కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు పని చేస్తున్నారు. ఉండి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు.

టిడ్కో గృహాలు ఉచితంగా ఇవ్వాలి : నిమ్మల



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

సిఎం జగన్ టిడ్కో గృహాలను నిరుపేదలైన మహిళా లబ్ధిదారులకు ఉచితంగా అందించి ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కోరారు. పట్టణంలోని 1, 2 వార్డుల్లో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఇంటింటి పాదయాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం టిడ్కో గృహాలకు అరబస్తా సిమెంట్, రూపాయి పని నోచుకోలేదని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలు 90 శాతం పూర్తికాగా వైసిపి ప్రభుత్వంలో మిగిలిన పది శాతం పనులు జరగలేదని చెప్పారు. గృహాలను అప్పగించకుండానే లబ్ధిదారుల పేరిట బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి ప్రభుత్వం రూ.కోట్ల సొమ్ము తన ఖాతాలోకి మళ్లించిందని చెప్పారు. రుణాల పేరిట లబ్ధిదారుల నెత్తిన రుణభారం మోపిన వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపాలని కోరారు. టిడ్కో గృహాలు చివరి లబ్ధిదారునికి అందేవరకూ తన పోరాటం ఆగేది లేదని ఎంఎల్ఎ చెప్పారు.

పాలకొల్లు రోటరీ క్లబ్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు సొంత భవనాన్ని నిర్మించుకున్నారు. కోటి రూపాయలకు పైగా రోటరీ క్లబ్ భవనాన్ని నిర్మించేందుకు దాతల సహకారంతో రోటరీ కమ్యూనిటీ సర్వీస్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు మద్దాల రాంప్రసాద్, కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, కోశాధికారి యిమిడి రాజేష్, రోటరీ కార్యవర్గం కృషి చేసింది. దాతల సాయంతో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని జిల్లా మాజీ గవర్నర్ లక్కరాజు సత్యనారాయణ (టిక్కు) శనివారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామ్మోహన్ భవన నిర్మాణానికి ఆర్థిక సాయం చేసిన ప్రతిఒక్కరినీ సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రావాడ సతీష్, కోశాధికారి ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, ప్రతినిధులు మద్దాల వాసు, కటారి నాగేంద్ర, కావలి నగేష్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, షేక్ పీర్ సాహెబ్, మైగాపుల రాంబాబు, రాపాక రత్నరాజు, కృష్ణవర్మ, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్తా, గాది వెంకన్న, పోతాబత్తుల సత్యనారాయణ, సలాది రామచంద్రరావు, కావలి నగేష్, దశిక శేషగిరిరావు, మద్దుల శశికిరణ్‌గుప్తా, చిలుకూరి భీమన్న, మూర్తి, సుధాకర్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు

రామేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రకుమార్

ప్రజాశక్తి - ఆచంట

వచ్చే నెల 8వ తేదీన మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆచంట శ్రీరామేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఏర్పాట్లు ప్రారంభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రకుమార్ తెలిపారు. శివరాత్రికి రామేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆలయానికి రంగులు వేసే కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. శివరాత్రికి వచ్చే యాత్రికుల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లలో నిమఘ్నమైనట్లు తెలిపారు. ఈ శివరాత్రిని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు

పెదపుల్లేరులో ఘనంగా సత్తెమ్మతల్లి జాతర

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పెదపుల్లేరు గ్రామ దేవత సత్తెమ్మ తల్లి 59వ జాతర మహోత్సవ సంబరాలు రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకటశివరామరాజు, డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, టిటిడి మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, జనసేన పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు హాజరయ్యారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించి శాలువా కప్పి సన్మానించి అమ్మవారి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకటశివరామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, గోకరాజు రామరాజు, జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ జాతర మహోత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు వేసి తాగునీటి సౌకర్యం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు రాయి రావులమ్మ, ఆలయ కమిటీ ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు (పెత్తందారు కృష్ణంరాజు), రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, వైసిపి సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ పాటూరి శ్రీనివాస దొరబాబు, కలిదిండి భాస్కరరాజు, కలిదిండి మురళీకృష్ణంరాజు, కలిదిండి శ్రీనివాస్‌వర్మ, కలిదిండి సీతారామరాజు, కలిదిండి సూర్యనారాయణరాజు, నడింపల్లి సత్యనారాయణరాజు, యడ్ల సత్యనారాయణ, గేదెల నరసింహులు, పప్పల రాంప్రసాద్, క్షత్రియ యూత్ సభ్యులు, బిసి యూత్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు చీఫ్ విప్ పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న వేములదీవి వెస్ట్ గ్రామానికి చెందిన కాండ్రేకుల నరసింహరావును, పట్టణంలోని 14వ వార్డుకు చెందిన సిరం దుర్గరాజును, మోకా అశ్వనీతేజను ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులను ఆయన పరామర్శించారు. ప్రమాదవశాత్తూ గోడకూలి చనిపోయిన నరసాపురం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన కొల్లాబత్తుల రియాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యాత్రికులతో బండి ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణరాజు పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'నిత్యం యోగా సాధన అవసరం'

ప్రజాశక్తి - పాలకొల్లు

నిత్యం యోగా సాధన వల్ల మనస్సు ఆధీనంలో ఉంటుందని, ఆరోగ్యం కాపాడుకోవచ్చని క్షీరాపురి యోగా సత్సంగం నిర్వాహకులు జవ్వాజి కల్యాణ్ చెప్పారు. రథసప్తమి సందర్భంగా ఆదివారం వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇరువురు సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు. సీనియర్ పాత్రికేయులు పిటి.వెంకటేశ్వరరావు, కూనపరెడ్డి చిన్నిలను సత్కరించారు. 65 మంది సభ్యులతో 108 సూర్య నమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి అమ్మవారి సహకారంతో నిత్యం యోగా సాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యోగా ప్రతిఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

కొత్తపాలెంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తపాలెంలో ఉన్న కాళిమాత సమేత వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక శివాలయంలో వీరభద్రస్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.